టూరిజం హోటల్ నిర్మాణానికి రూ.10 కోట్లు

కొడంగల్ / బొంరాస్‌పేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లి శివారులో టూరిజం హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నేతలు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆనందం వ్యక్తం చేశారు.



సలాం.. పోలీస్

శాంతి పరిరక్షణలో వారి పాత్ర మరువలేనిది

- 24/7 ఆన్ డ్యూటీ
- కుటుంబాలకు దూరంగా బాధ్యతలు
- త్యాగాలకు వెరవని ధీరులు
- విధి నిర్వహణలో ఎందరో అమరులు

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

"కనిపించే మూడు సింహాలు నీతికి న్యాయానికి ధర్మానికి సంకేతాలైతే.. కనిపించని నాలుగో సింహమేరా పోలీస్".. ఇది ఓ సినిమాలో హీరో చెప్పే డైలాగ్. కొందరు పోలీసులను చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రపంచమంతా నిద్రపోతున్నా.. 24 గంటలు మేల్కొని డ్యూటీ చేసేది ఒక్క పోలీసులు మాత్రమే. కుటుంబాన్ని, పండగలు పబ్బాలను సైతం త్యజించి.. ప్రజల కోసం పనిచేసే రక్షక భటుల సేవలు అనిర్వచనీయం. ఒక్కోసారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వస్తదని తెలిసినా వెనుకడుగు వేయని ధీరులు. పోలీసులు లేని వ్యవస్థను ఊహించలేం. ప్రజల రక్షణ కోసం పనిచేసే వారి విధి నిర్వహణలో ఎందరో అమరులైన సంఘటనలు ఉన్నాయి. నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అలాంటి వారి స్మృతులపై ప్రత్యేక కథనం.

7

గ్రూప్-1 మెయిన్స్‌కు సర్వం సిద్ధం


నేటి నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 17,762 మంది అభ్యర్థులు


ఎదులాబాద్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న గ్రూప్-1 మెయిన్స్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 17,762 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, జిల్లా అధికారులు, రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రం వద్ద ఎస్ఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మండలంలో 8 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్నట్లు తహసీల్దారు డీఎస్ రజిని తెలిపారు. నేటి నుంచి ఈ నెల 27 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిబంధనల ప్రకారమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.


వికారాబాద్ పట్టణ వ్యూ..

వుడాతో ఊతం!

'వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' ఏర్పాటుకు ఉత్తర్వులు

- జిల్లా యూనిట్‌గా అభివృద్ధి ప్రణాళిక.. 4 మున్సిపాలిటీలు.. 585 పంచాయతీలు
- మౌలిక వసతులు, అభివృద్ధే 'వుడా' ప్రధాన లక్ష్యం

జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాల పరిధిలోని గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం 'వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా)'ను ఏర్పాటు చేసింది. 'వుడా' పరిధిలోకి వచ్చే స్థానిక సంస్థల పాలక వర్గాల పాలనకు విఘాతం కలగకుండా ముందుకు సాగనుంది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకల్పన, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల అమలు పర్యవేక్షణ బాధ్యత 'వుడా' ఆధ్వర్యంలో కొనసాగనుంది. ప్రజలకు అవసరమైన వసతులు కల్పించే దిశగా ఈ అథారిటీ పని చేయనుంది.

వికారాబాద్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జిల్లా కేంద్రం చుట్టూ ఉండే కొన్ని గ్రామాలను కలుపుకొని పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశారు. కేవలం జిల్లా కేంద్రం, దాని చుట్టూ ఉండే కొన్ని గ్రామాలు మాత్రమే అభివృద్ధి చెందడానికి వీలు ఉండేది. అయితే జిల్లా కేంద్రం వరకే కాకుండా జిల్లా మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మునిసిపాలిటీలు, గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో 4 మునిసిపాలిటీలతో పాటు 585 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మునిసిపాలిటీలు, 585 గ్రామ పంచాయతీలు

మిగతా 8వ పేజీలో...



సీఎం చొరవతోనే ఏర్పాటు

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 8



భారత్‌ను శక్తిమంతంగా మార్చేందుకు కృషి

ఆర్ఎస్ఎస్ ప్రాంత సహవ్యవస్థ ప్రముఖ్ తిరుమలేశ్‌జీ 7

పరిగిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



రైతు దగా ప్రభుత్వం

- రైతు భరోసా ఎగవేతపై బీఆర్ఎస్ నిరసనలు
- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం 8

ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి 8

ప్రజా పోరాటాలకు సిద్ధం

- 18 అంశాలపై తీర్మానాలు
- జిల్లా కార్యదర్శి మహిపాల్
- ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మహిపాల్

తాండూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్ల కాలంలో ప్రజా సమస్యలే ఎజెండగా ప్రజల మధ్యలో ఉంటూ సీపీఎం పార్టీ పోరాటం చేస్తుందని పార్టీ నూతన జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కార్మికులు, కర్షకులు, పేదల సమస్యలే ఎజెండాగా ముందుకు సీపీఎం జిల్లా మూడో మహాసభలు ఆదివారం ముగిశాయి. కామ్రేడ్ సీతారం ఏచూరి నగర్‌గా నామకరణం చేసిన ఈ సభలు తాండూరు పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ సభలో 18 అంశాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి తీర్మానించారు. విద్యార్థులకు పెండింగ్ ఫీజులు, రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం, పాలమూరు - రంగారెడ్డి, కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం, తాండూరులో కంది బోర్డు ఏర్పాటు, పోడు భూముల్లో సాగులో ఉన్న గిరిజన, గిరిజనేతలకు హక్కు పత్రాలు, దళిత, గిరిజనులపై కుల వివక్ష దాడులు ఆరికట్టాలి. ధరణి పోర్టల్‌ను సవరించి జిల్లాలో భూ సమస్యల పరిష్కారం, మూసీ ప్రక్షాళన పేదలకు ప్రత్యామ్నయం, అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ, దివ్యాంగులు, వృత్తిదారుల, కార్మికుల, ఉపాధ్యాయుల, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ రుణాల మంజూరు, జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులకు సరిపడా మందుల సరఫరా తదితర అంశాలపై తీర్మానం చేపట్టారు. కాగా, మహాసభలు విజయానికి సహకారం అందించిన వారికి కమిటీ సభ్యులు కె. శ్రీనివాస్ ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులుగా ఎం. వెంకటయ్య, పి. రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, చంద్రయ్య, సుదర్శన్, సత్యనారాయణ, మంగమ్మ, నర్సమ్మ, నవీన్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



బీజేపీని బలోపేతం చేయాలి: ఈటల

మేడ్చల్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో సభ్యత్వం తీసుకొని పార్టీని బలోపేతం చేయాలని ఎంపీ ఈటల రాజేంద్ పిలుపు నిచ్చారు. ఆదివారం గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయించాలన్నారు. మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై చాలా మంది బీజేపీ వైపు చూస్తున్నారన్నారు.

ప్రకృతి సాగుకు సహకారం

- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్


మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ క్షేత్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని బూర్గుగడ్డ ప్రాంతంలోని సౌభాగ్య గోసదన్ సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన సేంద్రియ పంటలను, పండ్ల తోటలను, గోవులను పరిశీలించారు. పంటల సాగు విధానం, పశుపోషణ గురించి నిర్వాహకుడు విజయ్ రామ్ స్పీకర్‌కు వివరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగు విధానం బాగుందని, తమ వ్యవసాయ క్షేత్రంలో కూడా ప్రకృతి వ్యవసాయం సాయం చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ క్షేత్రంలో విజయరామ్ సాగు చేస్తున్న పంటల గురించి ఎక్కడికి వెళ్లినా ప్రజలకు, రైతులకు వివరిస్తానని ఆయన తెలిపారు. వ్యవసాయ క్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధారూరు మార్కెట్ కమిటీ చెర్మన్ విజయభాస్కర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశరక్షణ

షాబాద్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతి, రక్షణ బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుర్వగూడలో బీజేవైఎం మండలాధ్యక్షుడు దాదె మహేష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ న మోదు కార్యక్రమం చేపట్టారు. బీజేపీ దళిమోర్చా మండలాధ్యక్షుడు మహేందర్, నాయకులు నరేష్, రామకృష్ణ, అశోక్, సునీల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



నిఖిల కన్‌స్ట్రక్షన్స్‌కు 'సౌత్ ఇండియా బెస్ట్ బిల్డర్' అవార్డు



ఇండో-అరబ్ లీడర్ సమ్మిట్ అవార్డుతో ఎన్‌సీడీ చైర్మన్ శ్రీనివాసరావు

శంకర్‌పల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నిఖిల కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్(ఎన్‌సీడీ-మోకిల) హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయంగా చాటింది. ప్రఖ్యాత ఇండో అరేబియన్ బెస్ట్ లీడర్స్(బిల్డర్) అవార్డును సంస్థ దక్కించుకుంది. ఇటీవల ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన సమ్మిట్‌లో అవార్డును ఎన్డీసీ చైర్మన్ శ్రీనివాసరావు అందుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో గుర్తింపు పొందిన నిఖిల కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ సంస్థ.. ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో సౌత్ ఇండియా బెస్ట్ బిల్డర్ అవార్డును సాధించామని సంస్థ చైర్మన్ ఆదివారం తెలిపారు. మోకిలలో సంస్థ చేపట్టే ప్రాజెక్టులు పూర్తిగా గ్రీన్ బిల్డింగ్‌లన్నారు. అలాగే పోడియం పార్కింగ్, టెర్రస్ స్విమ్మింగ్‌పూల్, గోల్ఫ్ కోర్సులు, క్లబ్‌హౌజ్‌లు, వాకింగ్ ఏరియా తదితర అధునాతన సౌకర్యాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. త్వరలో దుబాయ్‌లోనూ సంస్థ కార్యకలాపాలను ప్రారంభిస్తామని చెప్పారు. అవార్డు వచ్చేందుకు, సంస్థను ఉన్నత స్థానంలో నిలిపేందుకు తోడ్పడిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు.

ప్రగతి నిరోధకంగా ప్రతిపక్షాలు : ఎంపీ



మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలను సన్మానిస్తున్న మండ్లీ రాములు

ఆమనగల్లు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం విషరాజకీయాలు సాగిస్తున్నారని, ప్రతిపక్షాలు ప్రగతి నిరోధకంగా మారాయని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజలచే తిరస్కరణకు గురైన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు అహంకార పోకడలు వీడలేదని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మల్లు రవి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండ్లీ రాములు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రవి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ప్రతీది రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారారని మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవనానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతుంటే కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని విపక్షాలు అడ్డుకునే యత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. పీసీసీ కార్యదర్శి మదుసూధన్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సలాం.. పోలీస్

శాంతి పరిరక్షణలో పోలీసులు కీలకం ▸▸ 24 గంటలూ ఆన్ డ్యూటీ ..
కుటుంబాలకు దూరంగా బాధ్యతలు ▸▸ త్యాగాలకు వెరవని ధీరులు
విధి నిర్వహణలో ఎందరో అమరులు ▸▸ నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

మందు పాతరకు ఎస్సై సైదయ్య బలి


సైదయ్య (ఫైల్)


డీటీగా విధులు నిర్వర్తిస్తున్న కోటేశ్వరి

ఇబ్రహీం పట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచాల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సైదయ్య మావోయిస్టుల మందుపాతరకు బలయ్యాడు. 2001 జూన్ 9న బండలేమూరులో జన్మభూమి కార్యక్రమం ముగించుకుని మోటార్ సైకిల్‌పై వస్తున్న సమయంలో మవోయిస్టులు పేల్చిన మందుపాతరకు కానిస్టేబుల్ సాయిలుతో సహా ఎస్సై దుర్మరణం చెందారు. సైదయ్య స్వస్థలం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రం. 1998లో ఆయనకు ఎస్సైగా ఉద్యోగం వచ్చింది. శిక్షణానంతరం మంచాల పీఎస్‌లో మొదటి పోస్టింగ్ ఇచ్చారు. దామరచర్లలో ఉండే మేనమామ కూతురు కోటేశ్వరితో 1997 ఆయనకు వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు. సైదయ్య మృతితో వారి కుటుంబంలో కష్టాలు మొదలయ్యాయి. పెద్ద కుమారుడు వంశీ మానసిక దివ్యాంగుడు. 2004లో కోటేశ్వరికి దామరచర్ల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగమొచ్చింది. తర్వాత ఆర్ఐగా ప్రమోటై వేములపల్లి డిప్యూటీ తహసీల్దారుగా విధుల్లో ఉన్నారు. చిన్న కొడుకు అనంత్ ఎంబీఏ చదువుతున్నాడు.

మావోయిస్టుల తూటాలకు నేలకొరిగిన రాజేశ్వర్‌రావు


రాజేశ్వర్‌రావు (ఫైల్)


పిల్లలతో కమల

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మడుపు రాజేశ్వర్‌రావు స్వస్థలం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్. అతను 1984లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందారు. 1987లో మంచాల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన కమలతో వివాహమైంది. వారికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడున్నారు. 1997 మార్చి 31న తెల్లవారుజామున మావోయిస్టులు యాచారం పోలీస్ స్టేషన్‌ను పేల్చివేసి డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు రాజేశ్వర్‌రావు, జమీల్ అహ్మద్‌లను తుపాకీతో కాల్చి చంపారు. అప్పట్లో భద్రత కింద ఆ కుటుంబానికి రూ.3లక్షలు పరిహారం ఇచ్చారు. కమలకు డీజీపీ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. ఆ తర్వాత పిల్లలను చదివించి పెళ్లిళ్లు చేశారు. కుమారుడు ఫణి భార్గవ్ జిమ్ ట్రైనర్, ఆర్టిస్టుగా ఉన్నారు. చిన్నకూతురు మానస భర్త కూడా పోలీస్ కానిస్టేబులే. కాగా, అప్పట్లో 300 గజాల ఇంటి స్థలం ఇస్తామని ప్రకటించినా నేటికి స్థలం చూపలేదని కమల అంటున్నారు.


మందుపాతరకు బలైన కానిస్టేబుల్ సాయిలు



పోలీస్‌స్టేషన్‌లో నివాళి

మంచాల: కె.సాయిలు స్వగ్రామం శంషాబాద్ మండలం శంకరాపూర్. 1993లో కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన ఆయనకు 1995లో రమాదేవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. 2001 జూన్ 9న బండలేమూర్‌లో జన్మభూమి కార్యక్రమం ముగించుకుని చెన్నారెడ్డిగూడకు అధికారులు వెళ్లారు. వారితో వెళ్లాల్సిన ఎస్సై సైదయ్య గ్రామస్థులతో మాట్లాడుతూ కాస్త ఆలస్యం చేశారు. సాయిలుతో కలిసి బైక్‌పై వెళ్తుండగా శివారులో మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఎస్సై, సాయిలు దుర్మరణం చెందారు. సాయిలు భార్య రమాదేవికి ఎక్స్‌గ్రేషియా, వ్యవసాయ శాఖలో ఉద్యోగం ఇచ్చింది. పెద్ద కుమార్తె కావేరి ఎమ్మెస్సీ పూర్తిచేశారు. చిన్నకుమార్తె కీర్తన ఎంబీఏ చదువుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ఇంటిస్థలం ఆ కుటుంబానికి 24ఏళ్లు గడుస్తున్నా అందలేదు.

బాంబు బ్లాస్ట్‌లో అమరుడైన అంజనేయులు


మృతిచెందిన అంజనేయులు ఫైల్‌ఫోటో

నందిగామ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎదిర అంజనేయులు గౌడ్ అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. 1997 డిసెంబరు 31న కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద జరిగిన బాంబు బ్లాస్ట్‌లో అతను అమరుడయ్యాడు. అప్పటికే అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంజనేయులు చనిపోవడంతో ప్రభుత్వం అతని భార్య సునీతకు ప్రభుత్వ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఆమె ప్రస్తుతం షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అంజనేయులు పెద్ద కుమారుడు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు.

విధి నిర్వహణలో అమరుడైన జమీల్ అహమ్మద్


మెహరున్నీసాబేగం జమీల్ అహమ్మద్ సతీమణి

యాచారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాచారం పోలీస్‌స్టేషన్‌ను 1997మార్చి 31న అర్ధరాత్రి రాచకొండ దళ మావోయిస్టులు పేల్చివేశారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హైదరాబాద్ పాత నగరానికి చెందిన జమీల్‌అహ్మద్, మంచాల మండలం ఖానాపూర్‌కు చెందిన మడుపు రాజేశ్వర్‌రావులను కాల్చి చంపారు. జమీల్ అహ్మద్ మృతిచెందిన ఏడాది తర్వాత ఆయన భార్య మెహరున్నీసాబేగంకు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చింది. ప్రస్తుతం మేడ్చల్‌లోని కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. అప్పట్లో కుత్బుల్లాపూర్‌లో 300గజాల స్థలం ఇచ్చారు. ఈమె ముగ్గురు కూమారులు జీవితంలో స్థిరపడ్డారు. ప్రతీ ఏడాది పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు తనను సత్కరించి జ్ఞాపికలను అందజేస్తుంటారని మెహరున్నీసా బేగం తెలిపారు.

దేశ రక్షణ కోసం పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్


కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని తెలంగాణ ప్రాంత ఉద్యోగి శాఖల ప్రముఖ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ రాంప్రసాద్‌జీ అన్నారు. చేవెళ్లలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలను చేవెళ్ల ఖండ ఆధ్వర్యంలో నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి వీధుల్లో స్వయం సేవకులు పద సంచాలన్ చేశారు. అనంతరం వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యమంతం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ శాఖల ముఖ్య లక్ష్యమన్నారు. జ్ఞానబిక్ష పెట్టిన భారత సంస్కృతి గొప్పదన్నారు. ప్రస్తుతం 60 దేశాల్లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఆలయాలపై ముష్కరుల దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. సమరయోధుల చరిత్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో కేరెల్లి అనంతరెడ్డి, చేవెళ్ల ఖండ సంఘ్‌చాలక్ క్రిష్ణారెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, మల్లేశం, మహిపాల్ రెడ్డి, అనంతరెడ్డి, వైభవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మ ఆలయానికి ఎమ్మెల్యే విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

చౌదరిగూడ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘణాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కోటమైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.లక్ష విరాళం అందజేశారు. మండలాధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీపీ సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్ నాయకులు శివమౌళి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి


ట్రోఫీని బహూకరిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో ఎదిగే క్రీడాకారులకు అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నందారం అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. 16 రోజుల పాటు కొనసాగిన పోటీల్లో 76 జట్లు పాల్గొన్నాయి. చివరిగా షాద్‌నగర్‌కు చెందిన గల్లీ టీం విన్నర్‌గా, రాయల్స్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేత టీమ్‌కు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌లు రూ.50వేల నగదు, ట్రోఫీని ఇచ్చారు. రన్నర్‌కు రూ.30వేల నగదు, ట్రోఫీని బహూకరించారు. బీఆర్‌ఎస్ నాయకులు నటరాజ్, తాండ్ర వెంకట్ రెడ్డి, చల్లా పాండురంగారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి : కోదండరెడ్డి


హోమం నిర్వహిస్తున్న పూజారులు

యాచారం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ఆదివారం నందివనపర్తిలో ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. గణపతిపూజ, ధాతున్యాస, రత్నన్యాస, అభిషేకం, వేదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు హోమాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో లబ్ధికే బీఆర్‌ఎస్ విమర్శలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నేత రఘు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కొందుర్గు మండలాభివృద్ధికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తంగళ్లపల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొందుర్గు మండలానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్టేడియం నిర్మాణాలను నిధులు మంజూరు చేయించారని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

దుష్ప్రచారానికి ఒడిగట్టిన జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ వెనుకబాటుకు కారణమైన మాజీ ఎమ్మెల్యేగుర్కా జైపాల్‌యాదవ్ తన వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారానికి ఒడిగట్టారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు, నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. ప్రజల తిరస్కరణతో ఓడిన జైపాల్‌యాదవ్ ఇంట్లో కూర్చుంటే రాష్ట్రంలో, కల్వకుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న ప్రగతి ఎలా కనబడుతుందని ఎద్దేవా చేశారు. 2018 ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఎమ్మెల్యే కసిరెడ్డి పేర్కొంటే తట్టుకోలేక జైపాల్ యాదవ్ తప్పుడు విమర్శలకు ఒడిగట్టారని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాములు, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

- ▸▸ నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ▸▸ రెండు రూట్లు, 11 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ▸▸ హాజరు కానున్న 8,008 మంది అభ్యర్థులు
- ▸▸ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఎగ్జామ్
- ▸▸ దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట అదనం
- ▸▸ అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు
- ▸▸ సీసీ కెమెరాల ఏర్పాటు, సెంటర్ల వద్ద భారీ బందోబస్తు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకూ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో రెండు రూట్లలో 11 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 8008 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఇందులో 5871 మంది పురుషులు, 2137 మంది మహిళలు ఉన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షల నిర్వహణకు కలెక్టర్ శశాంక చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణ రాష్ట్ర కమిషన్ అధికారులు చూస్తున్నారు. 40 మంది డిజేబుల్ చాలెంజ్ అభ్యర్థులు ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెసులుబాటు కల్పించింది. ఈ సారి దివ్యాంగులకు అదనంగా గంట సమయాన్ని కేటాయించింది. అన్ని పరీక్ష కేంద్రాలకు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మొయినాబాద్ మండలంలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ

- హాల్ టికెట్‌పై ఫోటోగ్రాఫ్, సంతకం స్పష్టంగా ఉండాలి.
- లేజర్ ప్రింట్‌తో ఏ-4 సైజు కాగితంపై ముద్రించిన హాల్ టిక్కెట్‌ను మాత్రమే తీసుకు రావాలి.
- ప్రతీ అభ్యర్థి తాజా పాస్‌పోర్టు సైజు ఫోటోను హాల్ టికెట్‌లో నిర్దేశిత స్థలంలో ముందుగానే అతికించుకోవాలి.
- హాల్ టికెట్‌పై అస్పష్టమైన ఫొటో ఉంటే.. అభ్యర్థి మూడు పాస్ ఫోటోలను సక్రమంగా అండర్ టేకింగ్‌తో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌తో పాటు చివరిగా అధ్యయనం చేసిన సంస్థ యొక్క గెజిటెడ్ అధికారి/ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరించబడిన వాటిని తీసుకువచ్చి ఇన్విజిలేటర్లకు ఇవ్వాల్సి ఉంటుంది.
- అభ్యర్థి గ్రూప్-1 ఎల్ సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలోనే అన్ని మెయిన్స్ పరీక్షలు (జనరల్ ఇంగ్లీష్ మినహా) రాయాలి.
- కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌డ్రైవ్స్, బ్లూటూత్ పరికరాలు, వాచ్, హ్యాండ్ బ్యాగ్స్, పౌచ్, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, లూజ్ షీట్లు తీసుకురాకూడదు.
- అభ్యర్థి చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షూ ధరించకూడదు.
- విలువైన వస్తువులను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకు రావద్దు.

పాటించాల్సిన నిబంధనలు

- మొదటి రోజు పరీక్షకు ఉపయోగించిన హాల్ టికెట్‌నే మిగిలిన ఆరు పరీక్షలకు ఉపయోగించాలి.
- ప్రతీరోజు పరీక్షకు సమయానికి రావాల్సి ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించారు.
- పరీక్ష రాయడానికి నలుపు లేదా నీలం రంగు బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే వాడాలి.
- పెన్సిల్, ఎరేజర్, హాల్ టిక్కెట్‌పై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డును మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు.

పరీక్షా కేంద్రాలు, అభ్యర్థుల వివరాలు

సెంటర్ పేరు	పురుషులు	మహిళలు	మొత్తం
సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, లసీస్ మెడికల్ సిస్టమ్స్ దగ్గర, మంగళపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం	625	159	784
శ్రీసింధు ఇంజనీరింగ్ కాలేజీ, నాగార్జున సాగర్ హైవే మెయిన్‌రోడ్డు, శేరిగూడగూడ గ్రామం, ఇబ్రహీంపట్నం	462	258	720
శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజీ, (ఈసీఈ బ్లాక్, సీఎస్ఇ బ్లాక్) శేరిగూడ గ్రామం, ఇబ్రహీంపట్నం	400	200	600
శ్రీదత్తా ఇంజనీరింగ్ కాలేజీ, నాగార్జున సాగర్ రోడ్డు, గాంధీ విగ్రహం దగ్గర, శేరిగూడగ్రామం, ఇబ్రహీంపట్నం	602	310	912
గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ, (సెంటర్-ఎ) గురుకుల పీఠం, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం	352	152	504
గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ, (సెంటర్-బి) గురుకుల పీఠం, ఖానాపూర్, ఇబ్రహీంపట్నం	325	179	504
మహాత్మాగాంధీ ఇంజనీరింగ్ కాలేజీ, చైతన్య భారతి పోస్ట్, ఓషన్ పార్కు దగ్గర, కోకాపేట్ గ్రామం, గండిపేట్	667	317	984
విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ, అజీజ్‌నగర్ గేట్, చిలుకూరు రోడ్డు, మొయినాబాద్	792	192	984
జోగిన్‌పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, భాస్కర్ మెడికల్ కాలేజీ పక్కన, భాస్కర్‌నగర్, మొయినాబాద్	672	144	816
కేజీరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ (సెంటర్-ఎ), మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పక్కన, చిలుకూరు. మొయినాబాద్	481	119	600
కేజీరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ (సెంటర్-బి), మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పక్కన, చిలుకూరు. మొయినాబాద్	493	107	600
మొత్తం	5871	2137	8008



డ్యామేజైన ఎస్కార్ట్ వాహనం

హర్యానా గవర్నర్ వాహన శ్రేణిలో ఢీకొన్న కార్లు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఎస్కార్ట్ వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న సంఘటన ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డుపై చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీ వెళ్లేందుకు దత్తాత్రేయ తన కాన్వాయ్‌తో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నారు. ఎయిర్‌పోర్టు రోడ్డుపై సడెన్‌బ్రేక్ వేయడంతో కాన్వాయ్ వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఎస్కార్ట్ వాహనాన్ని అంబులెన్స్, దాని వెనక మరో ఎస్కార్ట్ ఢీకొన్నాయి. మూడు వాహనాలూ స్వల్పంగా దెబ్బతిన్నాయి. అప్పటికే దత్తాత్రేయ ఉన్న కారు ముందుకు వెళ్లిపోయిందని, ఆయకేమీ కాలేదని, అనంతరం దత్తాత్రేయ ఢిల్లీకి వెళ్లిపోయారని పోలీసులు తెలిపారు.

రక్తదాన శిబిరం

మేడ్చల్ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో రక్తదానం నిర్వహించారు. రక్తదానం చేసిన తర్వాత శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర బాబులు గుర్తింపు పత్రాలను అందజేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అశోక్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టటానికి సీపీఎం నాయకులు ఉద్యమించాలని జిల్లా సీపీఎం కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. సీపీఎం మేడ్చల్ మండల రెండవ మహా సభలను ఆదివారం మేడ్చల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అశోక్ మాట్లాడుతూ... ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇప్పించటానికి, కాంట్రాక్టు పద్దతిలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల హక్కుల కోసం, నిత్యావసర ధరలు పెంచే ప్రభుత్వాలపై నిత్యం పోరాటం కొనసాగించాలని కోరారు. అనంతరం సీపీఎం మేడ్చల్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎం. నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రమేష్, డి.నర్సింగ్ రావు, ఎం.ప్రశాంత్, కె.నర్సింగ్ రావు, ఎ.కొమరయ్య, వసంత, జ్యోతి ఎన్నికయ్యారు.

ప్రతీ గ్రామంలో బీజేపీ సభ్యత్వాలు చేయించాలి


ఆలంపల్లిలో సభ్యత్వ నమోదు చేపడుతున్న బీజేపీ కార్యకర్తలు

ధారూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదులు చేయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి తెలిపారు. మండలంలోని నాగసమందర్, అవుసుపల్లి గ్రామాల్లోని బూత్‌లలో ఆదివారం పార్టీ నాయకులు నిర్వహిస్తున్న పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రతీబూత్‌లో 200 మందిని ఆన్‌లైన్ సభ్యత్వాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ వివేకానంద రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వికారాబాద్: పట్టణంలోని ఆలంపల్లి 23వ వార్డులో ఆదివారం వార్డు అధ్యక్షులు అశోక్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు కేపీ రాజు ఇంటింటికివెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

భారత్‌ను శక్తిమంతంగా మార్చేందుకు కృషి


మాట్లాడుతున్న తిరుమలేశ్‌జీ

పరిగి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): భారత్‌ను శక్తిమంతమైన దేశంగా మార్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లుగా కృషి చేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహవ్యవస్థ ప్రముఖ్ శ్రీమాన్ తిరుమలేశ్‌జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పరిగిలో స్వయం సేవకుల పథ సంచలనం(రూట్‌మార్చ్, సార్వజనికోత్సవం(పబ్లిక్ మీటింగ్) స్థానిక మినీ స్టేడియంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ, దేశంలో సం ఘటనలు, శాఖలు పెరిగిన కొద్దీ సమస్యల పరిష్కారానికి సులభం అవుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు బ్రహ్మయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముం దు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా స్వయం సేవకులు ర్యాలీ నిర్వహించారు.


కారును ఢీకొట్టిన డీసీఎం



ఆదిభట్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన డీసీఎం ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు స్తంబాన్ని ఢీకొట్టి నుజ్జునుజ్జైంది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో అందులోని వారికి ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన ఆదిభట్ల పరిధి రాగన్నగూడ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు బొంగ్లూరు నుంచి తుర్కయంజాల్ వెళ్తుండగా ఇబ్రహీంపట్నం నుంచి ఆటోనగర్ వెళ్తున్న డీసీఎం.. వెనకు నుంచి కారును ఢీకొట్టింది. దీంతో కారు వేరే లేన్‌లోకి దూసుకెళ్లి స్తంభాన్ని ఢీకొట్టింది. బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని వారు త్రుటిలో బయటపడ్డారు.

వృద్ధురాలికి పోలీసుల ఆసరా

కుటుంబీకుల వద్దకు చేర్చిన వైనం


గంగమ్మతో మాట్లాడుతున్న కానిస్టేబుల్

ఆదిభట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొడుకు, కోడలితో గొడవపడి ఐదు రోజుల క్రితం మమబూబ్‌నగర్ నుంచి నగరానికి వచ్చి తిండి లేక నీరసించిన ఓ వృద్ధురాలిని పోలీసులు చేరదీసి కుటుంబీకులకు అప్పగించారు. ఆదివారం ఆదిభట్ల ఎస్సై పి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం సాయిరాంనగర్ కాలనీ వద్ద నీరసంగా పడి ఉన్న వృద్ధురాలిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని మహిళకు ఆహారం తినిపించి వివరాలు తెలుసుకున్నారు. తన పేరు దారెడ్డి గంగమ్మ అని, మహబూబ్‌నగర్ జిల్లా వంగూరు మండలం జాలల గ్రామం అని, భర్త జాన్‌రెడ్డి అని తెలిపింది. కొడుకు, కోడలితో గొడవపడి బస్సెక్కి హైదరాబాద్ వచ్చానంది. పోలీసులు ఆ గ్రామ మాజీ సర్పంచ్, కుటుంబీకులతో వీడియా కాల్ మాట్లాడారు. వారి నిర్ణయం మేరకు తుర్కయంజాల్‌లోని బంధువుల ఇంటికి చేర్చారు. గంగమ్మ(70)ను కుటుంబం చెంతకు చేర్చిన పెట్రోలింగ్ పోలీసులు తేజేశ్వర్, పాండులను సీఐ రాఘవేందర్‌రెడ్డి అభినందించారు.

న్యూస్ బాక్స్

ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలి



రమేష్ గుప్తాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కీసర, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాల్కాజ్‌గిరి నియోజకవర్గం పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌లు అన్నారు. కీసరలోని కేబీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదె రమేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి నాగేష్ గుప్తా, ఇతర కమిటీ సభ్యులను వారు సన్మానించి, అభినందనలు తెలిపారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు



వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అవుషాపూర్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతీకార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. అవుషాపూర్‌కు చెందిన అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిలకమారి బాల్‌రాజ్‌తో పాటు మాజీ వార్డుసభ్యుడు పెద్దోళ్ల శ్యామ్, కాసుల సురేష్‌గౌడ్, మధులకు వజ్రేష్ యాదవ్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ కార్యక్రమంలో వామన్‌రెడ్డి, జంగయ్య, సందీప్‌రెడ్డి, మాదవరెడ్డి, సాయిచంద్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

వుడాతో ఊతం

(5వ పేజీ తరువాయి)

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చేలా ప్రతిపాదనలు రూపొందించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్వయం ప్రతిపత్తి ఉండనుంది. వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా) ఏర్పాటైతే కేంద్ర పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులకు నిధులు విడుదల కానున్నాయి. పట్టణాల అభివృద్ధికి పట్టణాభివృద్ధి శాఖ నిధులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గ్రామీణాభివృద్ధి శాఖ నిధులను వినియోగించనున్నారు. మౌలిక వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనులు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పర్యవేక్షణలో కొనసాగనుంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పట్టణాలతో పాటు గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించనుంది. మౌలిక వసతులకు పెద్ద పీట వేయనున్నారు. మునిసిపాలిటీలు, గ్రామాల పాలకవర్గాలకు అనుసంధానంగా ఈ అథారిటీ పనిచేయనుంది. లే అవుట్ల అభివృద్ధితో పాటు గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, కల్వర్టులు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి నేరుగా నిధులు వెచ్చించే అవకాశం ఉంటుంది. భవన నిర్మాణాలు, లేఔట్లు, పరిశ్రమల ఏర్పాటుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీయే అనుమతులు జారీ చేయనుంది.

పాలకవర్గాలకు అనుసంధానంగా..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే మునిసిపాలిటీలు, పంచాయతీల్లో పాలక వర్గాల పాలన ఎలాంటి విఘాతం లేకుండానే కొనసాగనుంది. పాలనా పగ్గాలు పాలకవర్గాలకు ఉండనున్నాయి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకల్పన, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల అమలు పర్యవేక్షణ బాధ్యత అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కొనసాగనుంది. ప్రజలకు అవసరమైన వసతులు కల్పించే దిశగా ఈ అథారిటీ పని చేయనుంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి వైస్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనుండగా, చైర్మన్‌ను ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిసింది. కాగా, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉంది.

సీఎం చొరవతోనే ఏర్పాటు : ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో వికారాబాద్ జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినట్లు పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. హెచ్ఎండీఏ తరహాలో వుడా ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటిలతో పాటు, అన్ని గ్రామాలకు కూడా ఈ అథారిటీ పరిధిలోకి వస్తాయనానరు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 'వుడా' ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పరిగి దామగుండంలో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రాబోతుందని తెలిపారు. జిల్లాలో ట్రిబుల్‌ఆర్, రైల్వేలైను, పాలమూరు ఎత్తిపోతలను కూడా సాధించి తీరుతామని తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, డీసీసీ కార్యదర్శి కె.హణ్మంత్‌ముదిరాజ్. మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడి చేసిన వారిని శిక్షించాలి



పెద్దేముల్: మంబాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దేముల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలయాలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో వద్ద జరిగిన ఘటనను నిరసిస్తూ మంబాపూర్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై అరగంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

కీసర: హిందూ దేవాలయాల జోలికి గానీ, సనాతన ధర్మాన్ని గానీ కించపరిచే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఖబడ్దార్ అని విశ్వహిందూపరిషత్ నాయకులు అన్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో వద్ద జరిగిన ఘటనను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ నాయకులు శాంతియుత ధర్నా నిర్వహిస్తే లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం కీసరలో విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆందోళన చేశారు. కీసరలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు కాషాయం జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిరిగిరిపేట్ గ్రామస్తులు

తాండూరు రూరల్, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని సిరిగిరిపేట్ గ్రామస్తులు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ శివారులో ప్రభుత్వ భూమి 26 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేలం నిర్వహించి విక్రయించారని చెప్పారు. అయితే తమ గ్రామంలోని భూమిలేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిచ్చిరెడ్డి, భద్రు, రాజశేఖర్, పరుశురాం, బాలు, హన్మంత్ ఉన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

తాండూరు: తాండూరు పట్టణంలోని శ్రీమహర్షి వాల్మీకి, గొల్లచెరువు, భవానీమాత జాతర ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి సోదరులు పలు సమస్యల దృష్టికి తేగా కమ్యూనిటీహాల్‌ను నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట పట్లోళ్ల బాల్‌రెడ్డి, నర్సింహులు, కౌన్సిలర్లు రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

ఆలయంలో న్యాయాధికారి పూజలు

కొడంగల్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దుద్యాల్ మండలంలోని హస్నాబాద్‌కు చెందిన ఎం.వినోద్‌కుమార్ బంజారాహిల్స్ కోర్టులో న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం స్వగ్రామానికి చేరుకుని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శివలింగానికి వెండితో తయారుచేయించిన నాగప్రతిమ, తిశులంను చేయించి ఆలయ అర్చకులకు అందజేశారు.



వెండితో తయారు చేసిన నాగప్రతిమ, త్రిశూలం అందజేసిన న్యాయాధికారి వినోద్‌కుమార్

రయ్.. రయ్

● ఉత్సాహంగా యమహా ట్రాక్ డే

శామీర్‌పేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 'యమహా ట్రాక్ డే' ఉర్రూతలూగించింది. రయ్.. రయ్‌మంటూ బైక్ రైడర్లు దూసుకెళ్లారు. బొమ్మరాసిపేట పరిధిలోని లియోనియ రిసార్ట్‌లోని డిస్ట్రిక్ గ్రావీటి గ్రౌండ్స్‌లోని సర్క్యూట్‌లో యమహా బైక్ కంపెనీ వైభవంగా ట్రాక్ డే నిర్వహించింది. ఈ కార్యక్రమం లో 300కి పైగా ఆసక్తి కలిగిన యమహా ఔత్సాహికులు, 120 మంది యమహా యజమానులు పాల్గొన్నారు. ట్రాక్‌పై హైకానిక్ ఏయిరాక్స్ ఎంటి- 03 మోడళ్ల బైక్‌లతో రైడర్లు సందడి చేశారు.



యమహా బైక్ రైడ్‌ను ప్రారంభిస్తున్న యమహా కంపెనీ ప్రతినిధులు

తీరిన విద్యుత్ స్తంభం సమస్య

బషీరాబాద్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లి ప్రధాన మార్గం మర్పల్లి సమీపంలో భగీరథ ట్యాంక్ వద్ద ఓ విద్యుత్ స్తంభం నేలచూపు చూస్తూ ప్రమాదకరంగా మారిన విషయం తెలిసిందే. ఈ విషయమై 'పొంచి ఉన్న ప్రమాదం.. రోడ్డుపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం' అంటూ ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎట్టకేలకు ఆశాఖ అధికారుల స్పందించారు. ఆశాఖ ఉన్నతాధికారుల ఆదేశంతో ఆదివారం స్థానిక అధికారులు కాంట్రాక్టర్‌ను పంపించారు. ఒరిగినస్తంభానికి మరో స్తంభం సపోర్టుగా పెట్టి సరిచేసి నిలబెట్టడంతో వాహనాదారులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



అధికారులు సరిచేయించిన స్తంభం

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్‌రోహిత్‌రెడ్డి ఆదేశానుసారం మండలానికి డీఎస్సీ ద్వారా నూతనంగా ఎంపికై వచ్చిన ఉపాధ్యాయులను మండలపార్టీ అధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి, ఆపార్టీ బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం సన్మానించారు.

● **తాండూరు రూరల్:** ఐనెల్లిలో గ్రామానికి చెందిన రైతు బాలకిష్టయ్య సాగు చేసిన పత్తి పంటను రాశీ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు పత్తిపంటను ఆదివారం పరిశీలించారు.

● **మేడ్చల్ టౌన్:** రావల్‌కోల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

● **పూడూరు:** వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం బీజాపూర్-హైదరాబాద్ నేషనల్ హైవేను నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులు నాందేవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి పరిశీలించారు.

● **బషీరాబాద్:** మండల కేంద్రంలో రూ.కోటీ 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. తాజాగా ఆలయ నిర్మాణానికి పురుషోత్తం (వ్యాయమ ఉపాధ్యాయుడు) తన వంతుగా రూ.51వేల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిల్‌గౌడ్‌కు ఆదివారం అందజేశారు.

● **ఘట్‌కేసర్:** ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిరమించుకోవాలని ఈనెల 25నుంచి డిసెంబరు1 వరకు జరిగే మాలల మహాపాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్ రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

● **పరిగి:** రూఫ్‌ఖాన్‌పేట్‌కు చెందిన ఎంటికల పెంటయ్య ఇటీవల మృతి చెందగా విద్యారణ్యపురిలో ఎస్సీ గురుకుల రెసిడెన్షియల్ 1996 టెన్త్ బ్యాచ్ మిత్రులు రూ.85వేలు సేకరించి బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు.

● **యాలాల:** లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన బోయ శ్రీశైలం అనారోగ్యంతో మృతి చెందగా పీఆర్టీయూటీఎస్ యాలాల మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆర్‌బీఎల్ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన మృతుడి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా తాండూరు బాలాజీ ఆస్పత్రి యజమాని, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్‌తోపాటు పలువురు గ్రామస్తులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

● **పరిగి రూరల్:** పట్టణ కేంద్రంలో ఆదివారం మాల మహానాడు, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ముత్యం ఇటీవల ఉద్యోగాలు సాధించిన మాలలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, శంకరయ్య, రాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** ఈనెల 21న ఎస్సీ ఉపకులాల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ హోలీయదాసరి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ దగ్గర సోమవారం జరిగే మహా నిరసన దీక్ష కార్యక్రమాన్ని హోలీయదాసరి కులస్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుత జనాభా 2024 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

గేదెను ఢీకొన్న బైక్.. మహిళ మృతి

మూడుచింతలపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గేదెను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన కుమార్ తన భార్య సంధ్య(26), బావమరిది ప్రవీణ్, కుమారుడు కౌశిక్‌లతో కలిసి కరీంనగర్ నుంచి హైదరాబాద్‌లోని అడ్డగుట్టకు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో తుర్కపల్లి, మజీద్‌పూర్ మధ్య రాజీవ్ రహదారి పై ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో రాగానే గేదె వీరి వాహనానికి అడ్డుగా వచ్చింది. దీంతో ప్రమాదవశాత్తు గేదెను ఢీ కొట్టడంతో కుమార్ బావమరిది ప్రవీణ్, భార్య సంధ్య, కుమారుడు కౌశిక్ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో సంధ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిన వివరాలిలా ఉన్నాయి. మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వినయ్‌రాజు(23) ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన కొద్దిసేపటికి వినయ్‌రాజు తండ్రి మజీద్‌పూర్‌లోని తన పొలం దగ్గరికి వెళ్లగా బైక్ కనిపించింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా హనుమకుంట పక్కన ఉన్న ఒక చెట్టుకి కరెంట్ కేబుల్ వైర్‌తో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పరిగి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రంగంపల్లిలో కె.నారాయణరెడ్డికి చెందిన పొలాన్ని అదే గ్రామానికి చెందిన పిట్ల వెంకటయ్య కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పందుల బెడద లేకుండా తన వేరుశనగ పంటకు విద్యుత్ వైరు ఏర్పాటు చేశాడు. అయితే, అదే గ్రామానికి చెందిన ఎల్చాలి బాలరాజు(34), తల్లి ఎల్చాలి పార్వతమ్మ, అన్న రాములుతో కలిసి శనివారం రాత్రి పొలం నుంచి ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో వేరుశనగ పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్‌వైరుకు తగిలి బాలరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన తల్లి పార్వతమ్మ, అన్న రాములు జాగ్రత్త పడడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోరు మోటార్ కేబుల్ వైర్ చోరీ

దోమ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన ఈడిగి తిరుపతయ్య గౌడ్ పొలం దగ్గర బోరు మోటార్ కేబుల్ వైరును గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. కేబుల్ వైరులో నుంచి రాగి తీగను తీసుకెళ్లి వైరును అక్కడే వదిలేశారు. మండలంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. అనుమానం ఉన్న వ్యక్తిపై బాధితుడు ఈడిగి తిరుపతయ్యగౌడ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రైతు దగా ప్రభుత్వం



బొంరాస్‌పేట్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దగా ప్రభుత్వమని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఆరోపించారు. రైతుభరోసా ఎగవేతను నిరసిస్తూ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పరిగి బస్టాండ్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్‌కుమార్, కె.శ్యాంసుందర్‌రెడ్డి, అరవింద్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

వికారాబాద్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం రైతులకు భరోసాను ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్ గోపాల్, విజయ్ కుమార్, మేక చంద్రశేఖర్ రెడ్డి, దేవదాసు, అశోక్, సుభాన్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమచేయాలని మన్నెగూడ చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు.

నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాంత్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి న్యూ బస్టాండ్ వరకు మాజీ జడ్పీటీసీ మధుకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్, చాచన్న, గోపాల్ పాల్గొన్నారు.


కొడంగల్: కొడంగల్‌లో రెండో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, డాక్టర్ నవాజు, మధు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తుంకిమెట్లలో బీఆర్ఎఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట్ల యాదగిరి, చాంద్‌పాష పాల్గొన్నారు.

దోమ: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బొంరాస్‌పేట్, దోమ మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై నిరసన తెలిపి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, మల్లేశం పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు రాజప్ప, పీరంపల్లి రాజు, లక్ష్మయ్య ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజప్ప, పీరంపల్లి రాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు. చౌడాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సింహయ్య, రాజశేఖర్, రమేశ్, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మేడ్చల్ పట్టణ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



మర్పల్లి: ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

వికారాబాద్, అక్టోబర్ 20: పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా నేటి నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, రక్తదాన కార్యక్రమాలు ఈ నెల 31వరు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు కొడంగల్ ఏఎంసీ ప్రమాణస్వీకారం

కొడంగల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నూతన చైర్మన్ అంబయ్యగౌడ్‌తో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మురారి ఫంక్షన్ హాలులో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.